


# ఇద్దరు కొడుకులు

ప్రఫుల్ల చంద్ర

కథ







భర్త రాక కోసం ఆందోళనగా ఎదురుచూస్తోంది సావిత్రి. ఆఫీసు నుంచి ఆరు గంటలకే వచ్చేసే శివరాం ఏడు దాటినా రాలేదు. ఆమె కాలు కాలిన పిల్లిలాగ ఇల్లంతా కలియదిరుగుతోంది.

అమ్మ బాబోయ్! కిర్రు ఎంత పని చేసింది! తలుచుకుంటే గుండె గుభేల్‌మంటున్నది. ఆయనకు వెంటనే చెప్పేసి పరిష్కారం గురించి ఆలోచించాలి. లేకుంటే చెయ్యి దాటిపోతుంది. పక్కింటి పిన్నిగారు హెచ్చరిస్తే తను నమ్మలేదు. కానీ తర్వాత దాఖలాలు కనిపించగా గుండె గుబగుబలాడిపోతోంది.

ఎట్టకేలకు శివరాం ఇంటికి రాగానే టీ ఇచ్చి పక్క కుర్చీలో కూర్చుంది. ఏదో విషయం ఉందని గ్రహించిన అతడు టీ చప్పరిస్తూనే ఏమిటి విశేషం అన్నట్లు ఆమె వైపు చూశాడు.

"మన కిర్రు ఎంత పని చేసిందో చూడండి" అందామె ఆందోళనగా.

"ఎంత పని?" నవ్వేడు శివరాం.

"అది ప్రేమలో పడినట్టుంది"

బాంబు వేశాననుకుందామె. కానీ టపాకాయ పేలినట్టు కూడా ప్రతిస్పందించలేదాయన! తను టెన్షన్‌తో రగిలిపోతుంటే ఆయనకంత నిశ్చింత ఏమిటో అర్థం కాలేదామెకు.

"టెన్షన్ ఎందుకే? నేను వాకబు చేశాను. మన కులం కాకపోయినా అబ్బాయి కూడా మనమ్మాయిలాగానే హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. మంచి జీతం. గౌరవనీయ కుటుంబం. తండ్రి లేడు. తల్లికభ్యంతరం లేకపోతే మనకూ ఉండనక్కరలేదు. ప్రేమ వివాహం కాబట్టి కట్నం ఇవ్వనక్కరలేదు. కులాంతరం కాబట్టి పెళ్లికి ఎక్కువమంది రారు. ఖర్చులు మిగులు!" నవ్వేశాడాయన ఖాళీ టీ కప్పు భార్యకిస్తూ.

కుతకుత ఉడికిపోయి భర్త వైపు కొరకొరా చూసింది సావిత్రి. ఆయన డబ్బు మనిషే. కానీ కూతురు పెళ్లి విషయంలో అలా మాట్లాడటం ఆమె భరించలేకపోయింది. కానీ ఏం చేయగలదు?

"ఈ పెళ్లి అంత ఈజీనా? వాళ్లు ఒప్పుకోవద్దూ?" అనుమానంగా అడిగింది సావిత్రి.

"అబ్బాయిని అమ్మాయి గుప్పిట్లో పెట్టుకుంటే అతగాడే తన తల్లిని ఒప్పిస్తాడులే" గుంభనగా నవ్వాడాయన.

ఉబికి వస్తున్న అసహ్యాన్ని వెనక్కి నెట్టేసి కిచెన్‌లోకి

వెళ్లిపోయిందామె.

శని, ఆదివారాలు సెలవు కావడంతో శుక్రవారం రాత్రే హైదరాబాద్ నుంచి ఇంటికొచ్చిన కిర్రుని అసలు విషయం ప్రస్తావించకుండా మామూలు కుశల ప్రశ్నలడుగుతోంటే చెల్లిని చూస్తూ గుంభనగా నవ్వాడు వివేక్.

రాత్రి భోజనాలయ్యాక డాబా మీదకెళ్లడం సావిత్రికీ అలవాటే. అయితే అలవాటుకి భిన్నంగా ఆ రాత్రి కిర్రు కూడా డాబా మీదకెళ్లింది.

కాసేపు పిచ్చాపాటీ అయ్యాక "గుర్రూ భద్రంగా నీ గుప్పిట్లోనే ఉన్నాడు కదా కిర్రూ?" అడిగాడు శివరాం.

"డాడీ! నన్ను కిరణ్మయి అని పిలవడం కష్టంగా ఉంటే కీరూ అని పిలవండి. కిర్రూ కాదు!" చిరుకోపంగా అంది కిరణ్మయి. హైదరాబాద్‌లో పాతిక వేలు జీతంతో ఉద్యోగం చేస్తున్న ఆమె తండ్రి మీద కూడా చిరాకు పడటం కొత్త అలవాటు!

"సరే, సరే. ఇంతకూ గుర్రూ నీ గుప్పిట్లోనే ఉన్నాడు కదా" నవ్వుతూ అడిగాడు శివరాం.

కీరూ కొరకొరా చూసింది- "అతని పేరు గౌరవ్! గుర్రూ కాదు" చిరాకుగా అని కాసేపాగి "తొందరగా పెళ్లి జరిగిపోతే మంచిది డాడీ! అతనికి సంబంధాలు చూస్తున్నారట" రహస్యంలాగ తగ్గు స్వరంలో అంది.

"అయితే అతడే తన తల్లి మీద ఒత్తిడి తెచ్చేటట్లు కొన్ని చిట్కాలు చెబుతాను"

శివరాం చిట్కాలు ఉపదేశిస్తూండగా డాబా మీదకొస్తూ సగం మెట్లెక్కి ఆగిపోయిన వివేక్ ఆయన కంట పడగా కొడుకు తమ సంభాషణ విన్నాడేమో అని కాస్త కంగారు పడి సర్దుకున్నాడు శివరాం.

రహస్య ఉపదేశాలు కాబోలు. నేను మళ్లీ వస్తానని వెనుదిరిగిన కొడుకుని ఆపి "అదేం లేదురా. ఊరికే పిచ్చాపాటి..." అని నసిగాడు శివరాం.

"ఇంతవరకూ బదిలీ తప్పించుకున్నాను. కానీ ఈసారి తప్పదు. రెండు నెలల్లో ఆర్డర్ రావచ్చు. ఈలోగా చెల్లి పెళ్లి అయిపోతే పెళ్లి పనుల్లో నేను సాయపడగలను" అనేసి చకచకా మెట్లు దిగి వెళ్లిపోయాడు.

"ఏమిటో వీడి పద్ధతి! మంచివాడే గానీ తండ్రి అభిప్రాయాల్ని, పద్ధతుల్ని శత్రువులాగ విమర్శిస్తాడు. మాటలతో చురకలు వేస్తాడు. తన మనసులో ఏముందో చెప్పడు" పిట్టగోడ మూల మౌనంగా కూర్చుని అంతా గమనిస్తున్న సావిత్రి నిట్టూర్చింది. తండ్రి నుంచి దూరంగా ఉండటానికే బదిలీ చేయించుకుంటున్నాడేమో అనిపించిందామెకు.

* * *

"అమ్మా! వాళ్లింటికి వెళ్దాం పద" అన్నాడు గౌరవ్.

నిర్ఘాంతపోయింది లక్ష్మి.

గౌరవ్ పుట్టిన తర్వాత సంవత్సరానికే భర్త చనిపోవడం ఆమెకొక పెద్ద షాక్. ఉద్యోగ నిర్వహణలో ఆయన చనిపోయినందున లక్ష్మికి ఉద్యోగం లభించడం ఒకింత ఊరట. కొడుకుని కట్టుదిట్టంగా పెంచి, పెద్ద చేసి ఇంజినీర్‌ని చేసిందామె. హైదరాబాద్‌లోని ఒక ఐటి కంపెనీలో కొడుక్కి మంచి ఉద్యోగం దొరకడంతో లక్ష్మిని అందరూ పొగిడారు. ఆమె పొంగిపోయింది.

కానీ ఆ తర్వాత గౌరవ్ తల్లికి షాక్ మీద షాక్ ఇస్తూనే ఉన్నాడు. ప్రేమించాను అన్నాడు. అది మొదటి షాక్. అమ్మాయిని వేరే కులం అన్నాడు. అది రెండో షాక్. ఆ అమ్మాయి మరెవరో కాదు. గౌరవ్ క్లాసుమేటే. చదువుకునే రోజుల్లో తరుచుగా తమ ఇంటికొచ్చేది. తనని పిన్నిగారూ అని పిలిచేది. దాంతో వారి స్నేహానికి తను అడ్డుచెప్పలేకపోయింది. ఇప్పుడేమో ఆ అమ్మాయినే ప్రేమిస్తున్నానని చెప్పి గుండెలో బండ పడేశాడు గౌరవ్. మొదటి నుంచీ ప్రేమ వ్యవహారం సాగుతున్నా తనని పిన్నిగారూ అని పిలుస్తూ మభ్యపెట్టిన అమ్మాయి కోడలైతే ఎన్ని అనర్థాలు జరుగుతాయో అని తల్లడిల్లిందా తల్లి.

రేపు ఆ అమ్మాయికి వేరే అబ్బాయితో పెళ్లిచూపులట. అందుకే ఇప్పుడే వాళ్లింటికెళ్లి ఆ పెళ్లిచూపులు రద్దు చేయించి వాళ్లని తమ వైపు తిప్పుకోవాలట.

"మనమే వాళ్లింటికి వెళ్లడం పద్ధతి కాదురా. వాళ్లే మొదట మనింటికి రావాలి" అంది లక్ష్మి గొంతు పెగల్చుకొని.

"చాదస్తాలు కట్టిపెట్టమ్మా! ఎవరు ఎవరింటికి వెళ్తేనేం? పని జరగాలి కదా" మొదటిసారిగా గౌరవ్ స్వరంలో చిరాకు వినిపించి షాక్ అయింది లక్ష్మి మరోసారి.

ఈ రోజుల్లో పిల్లలు ప్రేమలో పడడం, పెద్దలు కాదంటే అఘాయిత్యానికి పాల్పడడం పరిపాటే. పెద్దలకు చెప్పకుండా పెళ్లిచేసుకోవడం, కొందరు పెళ్లి చేసుకోకుండానే కాపురాలు పెట్టేయడం వింటూనే ఉన్నాం. భర్త ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని లక్ష్మి మనసు వ్యాకులపడింది. కంట తడి పెట్టుకుంది.


ఆ కన్నీరు చూసి కరిగిపోయాడు కాబోలు. "అమ్మా, నేను నీ వాడిని. కోడలు గానీ అత్తమామలు గానీ నిన్ను చిన్న చూపు చూస్తే నేనూరుకోను. నన్ను నమ్ము" మృదువుగా అన్నాడు గౌరవ్. అయితే-

పెళ్లి ముందు చేసే ప్రమాణాలు తర్వాత నిలబడవని ఆమెకు తెలుసు!

బంధువులకు బట్టలు, పెళ్లికూతురికి బంగారం, సన్నాహాలు పెళ్లంటే ఖర్చు. కనిష్టంగా మూడు లక్షలైనా అవుతుంది. లక్ష్మి చేతిలో అంత డబ్బు లేదు. రెండు మూడేళ్లలో డబ్బు సమకూర్చుకొని కొడుకు పెళ్లి చేయాలనుకుంటున్న ఆమెకు గట్టి చిక్కే వచ్చి పడింది. అయితే ఆమె నిస్సహాయురాలు. కొడుకు కోరిక ప్రకారం అప్పటికప్పుడు వారి ఇంటికి బయలుదేరింది. సంప్రదింపులకు రమ్మని ఆహ్వానించింది.

"అమ్మాయి, అబ్బాయి డిసైడ్ చేసుకున్నారు. మనం పెళ్లి అక్షింతలు వేయడమే. ఇంక సంప్రదింపులేముంటాయి?" అనేశాడు అమ్మాయి తాతగారు.

కట్నకానుకలివ్వరని లక్ష్మికి అర్థం అయింది. కనీసం పెళ్లి ఖర్చులైనా ఇస్తారని ఆశపడింది గానీ "మీ అబ్బాయే ప్రేమ, పెళ్లి అంటూ మా ఇంటి చుట్టూ తిరి



## 'రోబో'లో బిగ్ బి?

శంకర్ సినిమా 'రోబో'లో అమితాబ్ కూడా నటిస్తున్నాడనే వార్త జోరుగా షికారు చేస్తోందిప్పుడు. మణిరత్నం తను తీస్తున్న సినిమా గురించిన వివరాలు ఎంత గోప్యంగా వుంచుతాడో అతని శిష్యుడైన శంకర్ కూడా అంతకన్నా ఎక్కువ రహస్యంగా దాస్తాడు. అయితే కొద్దో గొప్పో వివరాలు అలా అలా బయటకు వచ్చేస్తుంటాయి. ఈ క్రమంలోనే అమితాబ్ బచ్చన్ గెస్టుగా 'రోబో'లో నటిస్తున్నాడనే సంగతి గురించి చెప్పుకుంటున్నారు. 'రోబో' బడ్జెట్ దాదాపు 125 కోట్లు దాటుతున్నట్టు అంచనా.

గాడు. మా కులంలో చదువుకున్న అమ్మాయిలు చాలా తక్కువ. ఉద్యోగం చేసే అమ్మాయిలు అరుదు. మా కిరణ్మయి పెద్ద ఉద్యోగం చేస్తోంది కాబట్టి మా కులం వాళ్లు కళ్లకద్దుకొని మా అమ్మాయిని ఎదురు ఖర్చులిచ్చి మరీ పెళ్లి చేసుకుంటారు" అని కుండబద్దలుగొట్టాడు శివరాం.

ఖిన్నురాలైంది లక్ష్మి. దుఃఖం ఉబికి వస్తోంది. ఆడ పిల్ల పెళ్లికి అప్పు చేయడం సహజం. కానీ వాళ్లు దర్జాగా కూర్చుంటే తను తల వంచుకుని అప్పు చేయవలసి వస్తోంది. కన్నీటి కళ్లతో కొడుకు వైపు కొరకొర చూసిందామె.

* * *

పెళ్లి ఏర్పాట్ల గురించి శివరాం, వివేక్ చర్చించుకుంటున్నారు.

హోటల్లో గ్రాండ్‌గా పెళ్లి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బంధుమిత్రులకు హోటల్ గదుల్లో బస. వారికి టిఫిన్, భోజనాలు హోటల్ వారే చూసుకుంటారు.

కళ్యాణమండపం, పెళ్లి భోజనాలు అదిరిపోవాలి అంటాడు కొడుకు.

ఎదురింట్లో విడిది. సొంత ఇంటిలో పెళ్లి. కులాంతరం కాబట్టి బంధువులు పెద్దగా రారు. ప్రేమ వివాహం కాబట్టి పెళ్లి సాదాసీదాగా చేసినా, లోటుపాట్లున్నా వాళ్లు సర్దుకు పోతారని తండ్రి వాదన. డబ్బు మిగులుతుంది కదా అని హితబోధ.

తండ్రి వైపు కొరకొరా చూశాడు కొడుకు.

తండ్రికి జీతం కంటే గీతం ఎక్కువ. తన జీతం అంతా తండ్రి చేతిలోనే పోసి అవసరాలకు అమ్మనడిగి తీసుకుంటాడు కొడుకు. కిరణ్మయి కూడా నెలనెలా జీతంలో సగం ఇస్తోంది. దానాదీనా బ్యాంక్ లాకర్లలో లక్షలకొద్దీ నగదు, నగలు మూలుగుతున్నాయి. పెళ్లి సందర్భంలోనైనా ఘనంగా ఖర్చుపెట్టడానికి ఆయనకు మనసు రాదు.

కిరణ్మయిలో ప్రేమ మొలకెత్తగానే డబ్బు ఖర్చు లేకుండా పెళ్లి చేసే మార్గం కనిపించిందాయనకు. ప్రేమ మొలకకు నీళ్లు పోసి, ఎరువులు వేసి పెంచి పోషించాడు.

కూతురు ప్రేమని అడ్డు పెట్టుకొని డబ్బు మిగుల్చుకోవాలన్న తండ్రి అతి తెలివికి అసహ్యం పొంగుకొచ్చింది కొడుకు హృదయంలో. అపుడేమీ మాట్లాడకుండా వెళ్లిపోయాడు. మర్నాడు ఆఫీసు నుంచి వస్తూనే తనకు బెంగళూరు బదిలీ అయిందని, మూడు రోజుల్లో అక్కడ జాయిన్ అవ్వాలని చెల్లి పెళ్లికి సెలవు దొరక్కపోవచ్చని చెప్పాడు.

* * *

ఎలా అయితేనే పెళ్లి జరిగిపోయింది. ఏర్పాట్లు సరిగా లేక బంధువులు చిటపటలాడారు. పెళ్లికొచ్చిన గౌరవ్ మిత్రులు భగ్గుమన్నారు.

"నా పెళ్లికి నువ్వొచ్చినప్పుడు నిన్ను యువరాజా లాగ చూసుకున్నాం. మరి నీ పెళ్లేంటిరా, బెగ్గర్స్‌కి సంతర్పణ పడేసినట్లు ఇలా జరిగింది!" అని నిలదీశాడు రాజా. మిగిలిన మిత్రులు అతనికి వంతపాడి రుసరుసలాడారు.

ఎవరెలా తిట్టుకున్నా పెద్దగా ఖర్చు లేకుండా కూతురు అత్తవారింటికెళ్లిపోయినందుకు సంతోషించాడు శివరాం.

* * *

ఆరు నెలలు గడిచాక

అక్కడొక కన్నతల్లి రోదిస్తోంది. పెళ్లి చేసుకుని పెళ్లాంతో వెళ్లిన కొడుకు తర్వాత ఒక్క ఫోన్ అయినా చెయ్యలేదు. తను ఫోన్ చేస్తే ఆఫీసు పనిలో బిజీగా ఉన్నానంటాడు. బహుశా అత్తవారింటికి వెళ్తున్నాడేమో. తన వద్దకు రాడానికి కోడలు పర్మిషన్ ఇవ్వడం లేదేమో. అయ్యో దేవుడా!...

ఇక్కడ మరో కన్నతల్లి రోదిస్తోంది. కొడుకు బెంగళూరుకి బదిలీ చేయించుకుని వెళ్లిన తర్వాత చెల్లి పెళ్లికి రానే లేదు. ఒక్క ఫోనూ చేయలేదు. తను ఫోన్ చేస్తే ఆఫీసు పనిలో బిజీగా ఉన్నానంటున్నాడు. ఆయనేమో వాడికి సంబంధాలు చూస్తున్నారు. వాడేమో రాడాయే. కాపురానికి వెళ్లిన కూతురూ ఫోన్ చేయడం లేదు. ఇంతకు ముందులా ఇంటికి రావడమూ లేదు. డబ్బు కక్కుర్తి పెళ్లి చేసినందుకు అల్లుడికి కోపం వచ్చిందేమో. అందుకే కూతురు రావడమూ లేదు. ఫోన్ చేయడమూ లేదు. ఇదంతా భర్త పీనాసితనం వల్లనే. అయ్యో, దేవుడా!...

ఆమె మౌనంగా అలా రోదిస్తూ ఉండగానే వీధిగుమ్మంలో వివేక్ ప్రత్యక్షం!

పట్టరాని ఆనందంతో శివరాం, సావిత్రి అక్కడకు పరుగుతీశారు.

"మీ కోడలు!" అంటూ తన వెనకనే ఉన్న అమ్మాయిని పరిచయం చేశాడు వివేక్.

సావిత్రి మ్రాన్పడిపోయింది. "మేం చచ్చాం అనుకున్నావా? మాకు చెప్పకుండా నీమట్టుకు నువ్వు పెళ్లి చేసుకోవడమేనా?" హిస్టీరియా వచ్చినట్టు అరిచాడు శివరాం. నోటికి కొంగు అడ్డుపెట్టుకొని ఏడుస్తోంది సావిత్రి.

"అర్హుడైన అబ్బాయిని ఎలా పడగొట్టి బుట్టలో పడేసుకోవాలో నువ్వు కీరూకి నేర్పినట్టే ఈ అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఈమెకు నేర్పారు నాన్నా! నేను పడిపోయాను! ఏం చేస్తాం మరి!" ఘనకార్యం చేసినట్టు నవ్వాడు వివేక్.

స్థాణువైపోయాడు శివరాం. కిచెన్‌లోకి పరుగుతీసి ఏడ్చేసింది సావిత్రి. ఆమె వెనకనే పెళ్లి.

"అమ్మా! నువ్వంటే మాకు ప్రేమాభిమానాలున్నాయి. నాన్నగారి పీనాసితనం, ఆయన పద్ధతులు నాకు నచ్చవు. డబ్బే పంచ ప్రాణాలాయనకు. నన్ను వేలంలో పెట్టి ఎక్కువ కట్నం తెచ్చే ఏ హిడింబినో, తాటకినో కట్టబెడతారని భయపడి ఇలా చేయవలసి వచ్చింది. నీకు నేనున్నానమ్మా!" ఆమె కన్నీళ్లు తుడిచాడు వివేక్.

★

## లేటు వయసులో...

యాభై ఏళ్లు దాటిన సంజయ్ దత్ అమధ్య మాన్యత అనే ఆవిడ్ని పెళ్లాడిన సంగతి తెలిసిందే! త్వరలో మాన్యత ఓ బిడ్డకు జన్మనివ్వబోతోందని బాలీవుడ్ సినీజనాలు గుసగుసలాడుకుంటున్నారు. గతంలో రిచాశర్మ అనే సినీతారని పెళ్లాడిన సంజయ్ దత్‌కి ఆమె ద్వారా త్రిషాలా అనే కూతురుంది. అనారోగ్యంతో అమెరికాలో మరణించింది రిచా. త్రిషాలాని అక్కడే చదివిస్తున్నాడు సంజయ్. ప్రస్తుతం లా ఫైనలియర్ చదువుతోందిట త్రిషాలా. అంటే డిగ్రీ చదువుతున్న ఆమెకి ఓ బుల్లి తమ్ముడో, చెల్లో పుట్టబోతోందన్నమాట.

